ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5





పోటెత్తిన భక్తులు

• నేటితో ముగియనున్న వీరమ్మ తిరునాళ్ల

ఉయ్యూరు వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. చివరి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, రహదారులు జనసంద్రమయ్యాయి. సోమవారంతో తిరునాళ్ల ముగియ నుండటంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

- 6లో..



• పోలియో చుక్కలు

పోలియో చుక్కల కార్యక్రమం ఆదివారం జిల్లా వ్యాప్తంగా జరిగింది. మచిలీపట్నం భాస్కరపురం 12వ సచివాలయంలో చిన్నారులకు డీఎంహెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి పోలియో చుక్కలు వేశారు. జిల్లాలోని 1453 కేంద్రాల్లో ఈ కార్యక్రమం ప్రారంభించారు. లక్షా 45వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. - మచిలీపట్నం టౌన్



గుడివాడలో నడిరోడ్డుపై వేదిక వద్ద కాపలా కాస్తున్న పోలీసులు

నడిరోడ్డుపై వేదిక... ఆపేది ఎవరిక!

• వైసీపీ నేతల ఇష్టారాజ్యం • పోలీసుల సహకారం

గుడివాడ : ప్రతిపక్షాలు చిన్న ర్యాలీ చేసినా ఆ పోలీసులు సహించరు. పదిమంది గుమిగూడితే గుడ్లు ఉరిమి చూస్తారు. ఏదో ఒక సాకుతో అరెస్టు చేస్తారు. అడ్డం చెబితే చావ బాదేస్తారు. అంతటితో ఆగకుండా క్రూరమైన కేసులు పెట్టేస్తారు. అదే అధికార పార్టీ ఏం చేసినా చట్టం గుర్తు రాదు. సెక్షన్లు తెలియవు. పైగా వారి కార్యక్రమం దగ్గరుండి మరీ పూర్తి చేయిస్తారు. పట్టణంలో ఆదివారం ఇదే జరిగింది. స్థానిక ముబారక్ సెంటర్‌లో వైసీపీ పట్టణ విభాగం ఆధ్వర్యాన ఎమ్మెల్యే కొడాలి నాని సమక్షంలో వైసీపీలో చేరికల కార్యక్రమం జరిగింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం ముబారక్ సెంటర్. దీని చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఈ రహదారి ప్రధానమైనది. ఆ పార్టీ నేతలు నడిరోడ్డుపై వేదికను ఏర్పాటు చేసి రహదారిని పూర్తిగా మూసివేశారు. మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. పోలీసులైతే వేదిక ఏర్పాటుకు ఎటువంటి ఆటంకం కలుగకుండా దగ్గరుండి కాపలాగాసి తమ స్వామిభక్తి చాటుకున్నారు. ట్రాఫిక్‌ను మళ్లించే పనిలో నిమగ్నమయ్యే ట్రాఫిక్ పోలీసులు వైసీపీ సేవలో తరించారు. అదే ప్రతిపక్షలు ఏదైనా చిన్న కార్యక్రమం చేయాలన్నా అనుమతులు తప్పనిసరి. అన్ని అనుమతులూ ఉన్నా ఏదో ఒకటి గుర్తుకు వచ్చి నిలుపుదల చేసేందుకు పోలీసులు అత్యుత్సాహం చూపుతారు.

అధికారం చేతిలో ఉంటే ఏమైనా చేయవచ్చు. తమ అనుయాయులను అడ్డుపెట్టుకుని మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి-65 పక్కనే ఉన్న కోట్లాది రూపాయల విలువైన భూములను ఆక్రమించేయొచ్చు. ఆక్రమించుకున్న భూమిలో మునిసిపల్ కార్పొరేషన్ నిధులతో రహదారుల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేసేయొచ్చు. మచిలీపట్నం డంపింగ్ యార్డులోని చెత్తా చెదారాన్ని ప్రభుత్వ భూమిలోకి తరలించి మెరక చేసేయొచ్చు. మెరక పనులు చేసినట్లుగా చూపి బిల్లులు కూడా చేసుకోవచ్చని మచిలీపట్నంలోని అధికార పార్టీ నాయకులు నిరూపించారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో ఇప్పటికే పదెకరాల భూమిని ఆక్రమించేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆక్రమించిన భూమిలో రేకుల షెడ్లు హడావుడిగా నిర్మించారు.అధికారులు ఆ వైపునకు కన్నెత్తి చూడటం లేదు.

ప్రభుత్వ భూమి కబ్జా



• ఆక్రమిత స్థలాల్లో వెలిసిన రేకుల షెడ్లు
• నోరు మెదపని రెవెన్యూ, మునిసిపల్ అధికారులు
• జాతీయ రహదారి పక్కనే కోట్లాది రూపాయల భూమి ఆక్రమణ

పాలకుల కనుసన్నల్లో కట్టడాలు



జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో వెలిసిన రేకుల షెడ్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి పక్కనే పట్టణ శివారు కుమ్మరిగూడెం వద్ద వందకోట్ల రూపాయల విలువైన 26 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిపై అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. దీంతో ఈ భూమి ఆక్రమణకు పక్కా ప్రణాళికను రూపొందించి రెండేళ్ల క్రితం మచిలీపట్నం డంపింగ్ యార్డులోని చెత్తను తీసుకువచ్చి ఈ భూమిని మెరక చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని మచిలీపట్నం కార్పొరేషన్ నిధులను మెరక పనుల పేరుతో బిల్లులు కూడా చేసుకున్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వ భూమిలో కార్పొరేషన్ నిధులతో మెరక పనులు ఎలా చేస్తున్నారని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. రెవెన్యూ, మునిసిపల్ అధికారుల వద్ద ఈ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చే ప్రతిపాదనలు నేటికీ లేవు. అయినా ఈ భూమిని మెరకచేసి బిల్లులు చేసుకున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు తమకు అనుకూలంగా ఉండే వారి పేరున ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించేశారు. ఈ విక్రయాలు జరిగిన కొంతకాలం తరువాత ఆక్రమిత భూమిలో ప్రభుత్వ నిధులతో రహదారులతోపాటు విద్యుత్ లైన్లు వేశారు.

స్టేడియం కోసం కేటాయించిన భూమిని ఆక్రమించేసి...

టీడీపీ ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో స్టేడియం నిర్మాణం చేసేందుకు ప్రణాళికను రూపొందించారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నాయకులు స్థానికులతో ఉద్యమం చేయించి, కోర్టులో రిట్ పిటిషన్లు వేయించి ఇక్కడ స్టేడియం నిర్మించకుండా అడ్డుకున్నారు. వైసీపీ అధికారం చేపట్టాక ఈ భూమిని మెరకచేయించి పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తున్నట్టుగా ప్రచారం చేసి పప్పూ బెల్లాల్లా ప్లాట్‌లను విక్రయించేసి సొమ్ము చేసుకున్నారు. ఇక్కడ ప్లాట్ల విక్రయంలో ఇద్దరు వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు, వారి అనుచరులు కీలకపాత్ర పోషించడం గమనించదగ్గ అంశం.

కబ్జా భూమిలో రేకుల షెడ్లు..

కుమ్మరిగూడెంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నామని చెబుతూ ఈ భూమి ఆక్రమణకు తెరతీయడం చర్చనీయాంశమవుతోంది. అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలుగా పట్టాలిస్తే, ప్రభుత్వమే పక్కాగృహాల నిర్మాణానికి నిధులు సమకూరుస్తుంది. ప్రభుత్వం ఇచ్చే నగదుతోపాటు, లబ్ధిదారులు తాము కొంత నగదును వేసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం గృహాల నిర్మాణం చేస్తారు. జగనన్న కాలనీల్లో నిర్మాణం చేసే గృహాలు నివాసయోగ్యంగా శ్లాబులు వేస్తుండగా, ఇక్కడ జరిగే నిర్మాణాలన్నీ రేకుల షెడ్లుగానే ఉండటం గమనించదగ్గ అంశం. కోట్లాది రూపాయల విలువైన భూమిలో రేకులషెడ్లు వేసి, అక్కడ ప్రజలు నివాసం ఉంటున్నట్లుగా చూపి, ఆ తరువాత ఈ భూమి మొత్తాన్ని తమ చేతుల్లోకి తీసుకునేలా అధికార పార్టీ నాయకుల వ్యూహంగా ఉందనే వాదన వినిపిస్తోంది. ఇటీవల మునిసిపల్ కార్పొరేషన్‌లో కీలక పదవుల్లో మార్పులు జరిగాక ఇక్కడ ఆక్రమణలు అధికం కావడం గమనించదగ్గ అంశం. అధికార పార్టీ నాయకులు తెరపైన కనపడకుండా తమ అనుచరుతో ఇక్కడి స్థలాలను విక్రయిస్తున్నారు. రెవెన్యూ, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు భూమి ఆక్రమణపై విచారణచేసి, కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాలు ఫిక్స్

ఎన్నికల సంఘానికి చేరిన జాబితా



- ఎన్టీఆర్ జిల్లాలో 1781 కేంద్రాలు
- వీటికి అదనంగా విజయవాడ రూరల్‌లోని 82 పోలింగ్ కేంద్రాలు జిల్లా పరిధిలోకి..
- అత్యధికంగా విజయవాడ వెస్ట్‌లో 298 కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల నోటిఫికేషన్‌కు సన్నద మౌతున్న దశలో ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల యంత్రాంగం పోలింగ్ కేంద్రాలను ఫిక్స్ చేసింది. ఈ మేరకు ఫిక్స్ చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలను జిల్లా ఎన్నికల యంత్రాంగం రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించింది. పోలింగ్ కేంద్రాలను ఫిక్స్ చేయటం వల్ల వీటిని మార్చే అవకాశం అయితే లేదు. తుది ఓటర్ల జాబితా అనంతరం ఓటర్ల దామాషాకు అనుగుణంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను పెంపుదల చేయాల్సి వచ్చింది. కొద్దిరోజుల కిందటే విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పది పోలింగ్ కేంద్రాలను పెంచారు. ఇలా ప్రతి నియోజకవర్గం పరిధిలో స్వల్పంగా పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. కలెక్టర్ ఢిల్లీరావు ఇటీవల తరచూ రాజకీయ పార్టీల నాయకులతో సంప్రదింపులు జరుపుతూ పోలింగ్ కేంద్రాల పెంపుదలకు నిర్ణయం తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1781 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో తిరువూరు నియోజకవర్గంలో 234 పోలింగ్ కేంద్రాలు, విజయవాడ ఈస్ట్ నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాలు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 257 పోలింగ్ కేంద్రాలు, విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో 298 పోలింగ్ కేంద్రాలు, మైలవరం నియోజకవర్గంలో 295 పోలింగ్ కేంద్రాలు, నందిగామ నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలు, జగ్గయ్యపేట నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

• గన్నవరం నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్ కేంద్రాలు ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే..

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 7 నియోజకవర్గాల పరిధిలో 1781 పోలింగ్ కేంద్రాలు కాకుండా కృష్ణాజిల్లా పరిధిలోని గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి విజయవాడ రూరల్ మండలం పరిధిలోని పలు గ్రామాలు ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఉన్నాయి. ఇవి 82 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. గన్నవరంతో కూడా కలిపితే మొత్తం 1863 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

అవనిగడ్డ నియోజకవర్గంలో దీవి గ్రామాల ప్రజల చిరకాల వాంఛ కలగానే మిగిలింది. వారిని బయట ప్రపంచానికి దగ్గర చేసే ఎదురుమొండి వారధిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం ప్రకటనలకే పరిమితమైంది. బ్రిడ్జి నిర్మాణానికి గత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన వైఎస్ జగన్ అధికారంలోకొచ్చాక ఎప్పటికప్పుడు ప్రకటనలు ఇవ్వడం తప్ప పని జరిగింది లేదు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఎటువంటి చొరవా చూపింది లేదు.

మొండి మాటలాయే!

నాలుగున్నరేళ్లుగా ఎదురుమొండి వారధిపై వైసీపీ నేతల బూటకపు ప్రకటనలు

- దీవి గ్రామాల సమూహమైన ఎదురుమొండి వారధిపై హై లెవల్ బ్రిడ్జి కలే
- ఎదురుమొండి దీవుల్లోని మూడు పంచాయతీల్లో నివసిస్తున్న 10 వేల మందికిపైగా మత్స్యకారులు బాహ్య ప్రపంచానికి దూరం
- టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన పంటు మాత్రమే నేటికీ దిక్కు
- నాటి ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీ ప్రకటనలకే పరిమితం



పంటు దిగి నడుచుకుని వస్తున్న కూలీలు

అవనిగడ్డ : గత ప్రభుత్వం 2018లో ఎదురుమొండి వారధి నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. ఇందుకు సంబంధించి ఏఐడీబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ బ్యాంక్) ద్వారా రాష్ట్రంలోని ఆర్ అండ్ బీ రహదారుల అభివృద్ధి, ఎదురుమొండి వారధి నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించగా, కొద్ది రోజులకే ఎన్నికల కోడ్ రావటంతో ఆ ప్రతిపాదన ఫైళ్ల దశలోనే నిలిచిపోయింది.

వారధి నిర్మిస్తామని జగన్ హామీ

ప్రతిపక్ష నేతగా ఎన్నికల ప్రచారం కోసం అవనిగడ్డ నియోజకవర్గానికి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి... అధికారంలోకి రాగానే వారధి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ విధానాలు నచ్చక ఏఐడీబీ రాష్ట్రంలో కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేసింది. అనంతరం పలుమార్లు స్థానిక నేతలు ముఖ్యమంత్రి దృష్టికి ఎదురుమొండి వారధి నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. 2020లోనే వారధి నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగీకరించారని స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు.

నిర్మాణానికి ప్రభుత్వ ప్రకటన

ఎదురుమొండి వారధి నిర్మాణానికి అనుమతి ఇస్తూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2022 ఏప్రిల్ 21న ఓ ప్రకటన విడుదల చేసింది. రూ.109 కోట్లతో ఎదురుమొండి వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని, నాబార్డు అందుకు ఆర్థిక సాయమందిస్తుందని ప్రకటించింది. సెప్టెంబరు 20వ తేదీన డీపీఆర్ తయారు చేసేందుకు ఆర్ అండ్ బీ, నాబార్డు అధికారులు ఎదురుమొండి దీవులను సందర్శించారు. వారంలోగా సాయిల్ పరీక్షలు పూర్తి చేసి 18 నెలల్లో వారధి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

అనంతరం 2023 జనవరి 28వ తేదీన నాబార్డు చైర్మన్ దివి ప్రాంతంలో పర్యటన సందర్భంగా కూడా దీనిపై ఎటువంటి ప్రకటనా రాలేదు. ఎంపీ బాలశౌరి నాబార్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, గత ఏడాది ఆగస్టులో వారధి నిర్మాణానికి రూ.143 కోట్లు మంజూరయ్యాయని కలెక్టర్ రాజాబాబు తెలిపారు. అప్పటి నుంచి కొద్ది నెలలపాటు వారధి విషయం మరుగున పడిపోగా, స్థానిక ప్రజలు, ప్రతిపక్షాలు వారధి నిర్మాణం ఏమైందంటూ వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కు పెట్టడంతో డిసెంబర్‌లో రూ.109 కోట్లతో వారధి నిర్మాణానికి టెండర్లు పిలిచినప్పటికీ నాబార్డు మంజూరు చేసిన మొత్తానికి ఆర్ అండ్ బీ అధికారులు ఇచ్చిన టెండర్‌కు సాపత్యం లేకపోవటంతో కాంట్రాక్టర్లు ఎవ్వరు టెండర్లు వేసేందుకు ముందుకు రాలేదు.

విజిలెన్స్‌ను కదిలించిన ఇంటెలిజెన్స్

ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలపై రహస్య నివేదిక



- పీడీఎస్ బియ్యం మాఫియాతో లింక్‌లు
- విభాగంలోకి కొత్త నీరు
- ప్రస్తుతం ఉన్న వారిని రేంజ్‌కు పంపిన అధికారులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఒక నివేదిక పాత నీరును పంపేసింది. కొత్త నీరును తీసుకొచ్చింది. విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐల మార్పు వెనుక ఇంటెలిజెన్స్ నివేదిక ఉన్నట్టు నిఘా వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. వివిధ జిల్లాలో పనిచేస్తున్న కొంతమంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు విజిలెన్స్‌ను ఎంచుకున్నారు. అప్పటి అధికారులతో ఉన్న పరిచయాలను ఉపయోగించుకుని సిఫార్సులు చేయించుకున్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విజిలెన్స్‌కు వెళ్లిన అధికారులు అక్కడే పాతుకుపోయారు. కొంతమంది రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం నుంచి చక్రం తిప్పితే, కొంతమంది జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ కార్యాలయంలో చక్రం తిప్పారు. కల్తీ వ్యవహారాలు, నకిలీ బాగోతాలను వెలికి తీయాల్సిన విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు ఆ మాఫియాలతో మిలాఖత్ అయినట్టు తీవ్రంగా ఆరోపణలు ఉన్నాయి. నేరుగా నిఘా విభాగంలో అధికారులు అండదండలు ఉండడంతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో కల్తీ మాఫియా రెచ్చిపోతోందని తెలిసింది.

• అసలు ఏం జరిగింది?

ఉమ్మడి కృష్ణా జిల్లాలో బియ్యం మాఫియా భూమి మీద నిలబడటం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యాన్ని లారీల్లో మిల్లులకు, పోర్టులకు తరలిస్తోంది. ఈ మాఫియాకు జిల్లా మొత్తం కొంతమంది ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ బియ్యాన్ని భద్రపరచడానికి ఆటోనగర్‌లో పెద్ద గొడౌన్ నడుస్తోంది. ఇక్కడ రాత్రిపూట లోడింగ్, అన్‌లోడింగ్ జరుగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ తరహా గోడౌన్లను మాఫియా నిర్వహిస్తోంది. విజిలెన్స్ అధికారులు ఇప్పటి వరకు ఈ గోడౌన్ల జోలికి వెళ్లిన దాఖలు ఎక్కడా కనిపించలేదు. నిఘా విభాగం పనిచేస్తుందన్న భావన కలిగించడానికి అప్పడప్పుడు మెరుపు దాడులు చేసేవారు. ఆటోలు, మినీ వాహనాల్లో వెళ్తున్న బియ్యాన్ని సీజ్ చేశామని ప్రకటనలు ఇచ్చేవారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న గొడౌన్లలో అనధికారికంగా ఉన్న పీడీఎస్ బియ్యం గుట్టు తెలిసినా వాటివైపు కన్నెత్తి చూడలేదు. దీని కారణం నెలవారీగా మాఫియా నుంచి లక్షలాది రూపాయల ముడుపులు అందడమేనని ప్రచారం జరుగుతోంది. కొద్దినెలల క్రితమే ఇంటెలిజెన్స్ విభాగం దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఒక నివేదికను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులకు ఇచ్చినట్టు సమాచారం. ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలకు ఏ స్థాయిలో ముడుపులు అందుతున్నాయో ఈ నివేదికలో స్పష్టం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నివేదికను పరిశీలించిన ఉన్నతాధికారులు విజిలెన్స్‌లో ఉన్న పాత ముఖాలను బయటకు పంపేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఒక ఎస్‌ఐను విజయవాడ నుంచి తూర్పుగోదావరి జిల్లా వీఆర్‌కు పంపేశారు. ఇన్‌స్పెక్టర్‌ను ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేశారు. రేంజ్ అధికారులు ఎన్నికల బందోబస్తు నిమిత్తం ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు అటాచ్‌మెంట్ ఇచ్చారు.

• ఉన్నతాధికారుల పరిచయాలతో...

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి వెళ్లాంటే దానికి సుదీర్ఘ ప్రక్రియ ఉంటుంది. విజిలెన్స్‌కు వెళ్లాలనుకున్నవారు ముందుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీకి దరఖాస్తు చేసుకోవాలి. ఆయన సంబంధిత యూనిట్ ఆఫీసర్ (కమిషనర్/ఎస్పీ) ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను, ట్రాక్ రికార్డును రప్పించుకుంటారు. అన్నీ పరిశీలించుకున్న తర్వాత విజిలెన్స్‌లో పనిచేయడానికి వారు అర్హులు అని గుర్తిస్తే ఆ ఫైల్‌ను డీజీపీ కార్యాలయంలో ఉన్న పర్సనల్ విభాగానికి పంపుతారు. ఈ విభాగం ఆయా కమిషనరేట్, జిల్లాలో ఉన్న సిబ్బంది సంఖ్యను పరిశీలించిన తర్వాత రిలీవింగ్ ఉత్తర్వులు ఇస్తుంది. ఆ తర్వాత దరఖాస్తు చేసుకున్న ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు విజిలెన్స్ విభాగంలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇలా వెళ్లిన వారి సేవలు సంతృప్తికరంగా లేకపోయినా, ఆరోపణలు తీవ్రమైన స్థాయిలో ఉన్నా వారిని తిరిగి పర్సనల్ విభాగానికి పంపేస్తారు. అక్కడి నుంచి ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేస్తారు. 2019లో వైసీపీ విజయవాడలో పోలీసు కమిషనర్‌గా పనిచేసిన అధికారులు డీజీ స్థాయికి వెళ్లడంతో ఆ పరిచయాలను ఉపయోగించుకుని కొంతమంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు వారి ఫైళ్లను చకచకా నడిపించుకు న్నారు. ఐదేళ్లపాటు అటు రాష్ట్ర కార్యాలయంలో, ఇటు జిల్లా కార్యాలయంలో తిష్ట వేసుకుని ఉండిపోయారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

• మైనర్ సహా ఆరుగురి అరెస్టు
• ఐదు బైక్‌లు, సెల్‌ఫోన్లు, గంజాయి స్వాధీనం

- 6లో..



భక్తులతో జనసంద్రంలా ఆలయ ప్రాంగణం

వీరమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

ఉయ్యూరు, మార్చి 3 : వీరమ్మతల్లి తిరునాళ్లకు ఆదివారం భక్తులు పోటెత్తారు. తిరునాళ్లలో చివరి ఆదివారంతో పాటు సోమవారంతో తిరునాళ్ల ముగియనుండగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి జనసంద్రంలా మారింది. వేకువజామునుంచి భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి పాలపొంగళ్లతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి దర్శనానికి క్యూలైన్లతో పాటు ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎండలో ఇబ్బందులు తప్పలేదు. నిలబడ్డారు. భక్తుల రద్దీని అదుపుచేసేందుకు పోలీసులు అవస్థలు పడ్డారు.

రేపట్నుంచి దుర్గానాగేశ్వర కళ్యాణ బ్రహ్మోత్సవాలు



మోపిదేవి, మార్చి 3 : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లిలో స్వయంభువుగా కొలువైన దుర్గానాగేశ్వర స్వామి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల 5వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 5వ తేదీ ఉదయం 11.45 గంటలకు స్వామివారిని పెండ్లికుమారుని చేయుటతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 6, 7 తేదీల్లో స్వామివారి నిత్య బలిహరణ, రాజాధిరాజంపై గ్రామోత్సవం జరుగుతాయి. 8వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము 2 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 4 గంటలకు స్వామి, అమ్మవార్ల దర్శనం ఉంటాయి. రాత్రి 7 గంటలకు జగాజ్యోతి కార్యక్రమం, రాత్రి 1 గంటకు ఎదుర్కోలు ఉత్సవం, అనంతరం స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం జరుగుతాయి. 9వ తేదీ రాత్రి 8 గంటలకు స్వామివారి రథోత్సవం, 10వ తేదీ ఉదయం 10 గంటలకు వసంతోత్సవం, 11, 12, 13 తేదీల్లో ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పశయాలంకృత పవళింపు సేవా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



నూతన పాలకవర్గ కమిటీ ప్రతినిధులతో ఆనందసూర్య

బ్రాహ్మణ ద్వేషి జగన్‌ను ఇంటికి సాగనంపండి : ఆనందసూర్య

మచిలీపట్నం టౌన్, మార్చి3 : బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన సీఎం జగన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో బ్రాహ్మణ ద్వేషిగా మిగిలిపోతారని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన వ్యవస్థాపక అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య అన్నారు. ఆదివారం మచిలీపట్నంలోని కళ్యాణమంటపంలో జాతీయ, రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యుల చేత ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జాతీయ అధ్యక్షుడిగా గోడేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా బీఎస్ విద్యాసాగర్, వి.పురుషోత్తమరావు, వై.సాయి సురేష్, జంధ్యాల బుచ్చిబాబు, ఎఆర్కే మూర్తి, ప్రధాన కార్యదర్శిగా ధవళ వెంకటరావు, క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా జీవీ హనుమంతరావుల చేత ప్రమాణ స్వీకారం చేశారు. సంఘటన రాష్ట్ర అధ్యక్షుడిగా వేమూరి రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా వారణాశి దుర్గాసారథి, కృష్ణాజిల్లా సంఘ అధ్యక్షుడిగా సోమయాజులు రఘుశర్మ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా ఎ.సుజన సారథి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడగా శివకుమార్‌తోపాటు వివిధ జిల్లాలకు నూతనంగా ఎన్నికైన ఆర్బీఎస్ ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వేమూరి ఆనందసూర్య మాట్లాడుతూ, ఎన్నికలు పూర్తయ్యేవరకు ఆర్బీఎస్ నాయకులు, కార్యకర్తలు టీడీపీ, జనసేన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. బ్రాహ్మణులు సమిష్టిగా వైసీపీ ప్రభుత్వంపై ఉద్యమించాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి రావాలంటూ గత 18 నెలలుగా ఆర్బీఎస్ జాతీయ అధ్యక్షుడు గోడేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు భోజనం చేయకుండా సూర్యోపాసన చేస్తున్నారన్నారు. టీడీపీ జనసేన కూటమి అధికారంలోకి వస్తే బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం కల్పిస్తామన్నారని చెప్పారన్నారు. ఈ సందర్భంగా ఆనందసూర్యకు తిరుపతినుంచి వచ్చిన నాయకులు లడ్డూ, వడ ఇచ్చి సత్కరించారు.



పట్టువస్త్రాలు ఉంచిన పళ్లెరాలతో దుర్గగుడి ఈవో రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు తదితరులు

శ్రీశైల మల్లన్నకు పట్టు వస్త్రాల సమర్పణ

వన్‌టౌన్, మార్చి 3 : శ్రీశైలంలో భ్రమరాంబ మల్లేశ్వరుల బ్రహ్మోత్సవాల సందర్భంగా దుర్గామల్లేశ్వరదేవస్థానం తరఫున ఆదివారం ఈవో రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు తదితరులు పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చక బృందంతో పాటు వెళ్లిన రామారావు, రాంబాబులకు శ్రీశైల దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల మధ్య, మేళతాళాలు, శివనామ స్మరణల మధ్య పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు



సమావేశంలో మాట్లాడుతున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

నేడు కలెక్టరేట్ ఎదుట సర్పంచ్‌ల ధర్నా

ఉయ్యూరు : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్ ఎదుట సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ధర్నా నిర్వహించనున్నట్టు చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య సాధనే లక్ష్యంగా 73, 74 రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243జి 11 షెడ్యూల్లో పేర్కొన్న 29 అంశాలలో నిధులు, విధులు, అధికారాలు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్‌లకు బదలాయించి గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లాపరిషత్‌లను బలోపేతం చేయాలని, సర్పంచుల 16 డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న సర్పంచుల ధర్నాలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సర్పంచుల సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్, మద్రివాడ సర్పంచ్ వంపుగడల ఫ్రాన్సిస్, వీర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలు వచ్చేశాయి

- ఎన్నికల బందోబస్తుకు మూడు కంపెనీలు
- చెన్నై సీఐఎస్ఎఫ్ బేస్ నుంచి రాక
- ఒక్కో కంపెనీలో 92 మంది సిబ్బంది
- గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్



విజయవాడలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల బందోబస్తుకు పారా మిలటరీ బలగాలు విజయవాడకు చేరుకున్నాయి. సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)కు చెందిన మూడు కంపెనీలు కమిషనరేట్‌కు వచ్చాయి. ఒక్కో కంపెనీలో 92 మంది సిబ్బంది ఉంటారు. చెన్నై సీఐఎస్ఎఫ్ బేస్ క్యాంపు నుంచి ఈ బలగాలు వచ్చాయి. ఎంజీ రోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో ఉన్న సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం ఆధీనంలో ఈ బలగాలు ఉన్నాయి. ప్రస్తుతానికి మూడు కంపెనీలు వచ్చినప్పటికీ త్వరలో మరిన్ని కంపెనీలు వస్తాయని తెలుస్తోంది. ఎన్టీఆర్ జిల్లా పోలీసులు, ఈ కంపెనీలతో కలిసి సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అధికారులు ఎన్టీఆర్ జిల్లాలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించారు. స్టేషన్ల వారీగా ఆయా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్‌లకు మ్యాప్‌లను సిద్ధం చేశారు. రోజుకు ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ మార్చ్‌లు చేస్తారు. విజయవాడ కొత్తపేట స్టేషన్ పరిధిలో వైఎస్సార్ కాలనీ, పిన్నెనవరం, అంబాపురం ప్రాంతాల్లో పశ్చిమ ఏసీపీ పడాల మురళీకృష్ణారెడ్డి, పశ్చిమ జోన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి, గణేష్, వి.కృష్ణ, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు ఫ్లాగ్ మార్చ్ చేశారు. తిరువూరు ఏసీపీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో మైలవరంలో ఈ మార్చ్ సాగింది. నందిగామ ఏసీపీ బి.రవికిరణ్, జగ్గయ్యపేట ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఫుల్లా చంద్రశేఖర్ ఈ సీఐఎస్ఎఫ్ బలగాలతో జగ్గయ్యపేటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సిటీ డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, రూరల్ డీసీపీ కంచి శ్రీనివాసరావు ఫ్లాగ్‌మార్చ్‌ల్లో పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించేంత వరకు పోరాటం

- రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రావణ్ నిరవధిక దీక్ష
- విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్



నాగశ్రావణ్‌కు సంఘీభావం తెలుపుతున్న గద్దె రామ్మోహన్, కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు

విద్యాధరపురం, మార్చి 3 : విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించేంతవరకు తమ పోరాటం ఆగదని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్ చెప్పారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన నిరవధిక నిరాహారదీక్షకు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ వైఖరి కారణంగా విద్యార్థులు ఎంతో నష్టపోతున్నారన్నారు. విద్యార్థుల ఫీజులు చెల్లించలేని ప్రభుత్వం.. సిద్ధం సభలకు రూ.800 కోట్లు ఖర్చుచేయడం దారుణమన్నారు. 2019లో పీజీ చేసిన విద్యార్థులకు జీవో 77 సాకుగా చూపి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదన్నారు. విద్యార్థులకు నష్టం కలిగించే జీవో 77ను రద్దు చేయాలన్నారు. రూ.2750 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలన్నారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌లు శ్రావణ్‌కు సంఘీభావం తెలిపారు. సకాలంలో బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజును విద్యార్థులే చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, కళాశాలలకు వెళ్లలేక విద్యార్థులు సతమతమవుతున్నారన్నారు. దీక్షకు టీడీపీ యువత మద్దతు తెలిపింది.

ఉద్యోగ నియామకాలు చేపట్టండి

- నిరుద్యోగ జేఏసీ డిమాండ్



అవనిగడ్డలో నిరసన తెలుపుతున్న ఏపీ నిరుద్యోగ జేఏసీ

అవనిగడ్డ, మార్చి 3 : ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికలకు వెళ్లాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షులు సమయం హేమంత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ నిరుద్యోగ ఓదార్పు యాత్రలో భాగంగా ఆదివారం అవనిగడ్డలో డీఎస్సీ ఆశావహులతో కలిసి అవనిగడ్డలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెగా డీఎస్సీ అని నిరుద్యోగులకు ఆశపెట్టి 6100 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేలా మెగా డీఎస్సీ ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రూపు-2 ప్రాథమిక పరీక్షా ఫలితాలను రెండు వారాల్లోపు విడుదల చేస్తే ప్రధాన పరీక్షకు చదువుకోవటానికి సమయం ఉంటుందని, డీఎస్సీ పరీక్ష జరిగే రోజే గ్రూపు-1 ప్రాథమిక పరీక్ష కూడా జరుగనున్నందున దీనిని రద్దు చేయాలని, పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 26 వేల ఉద్యోగాలను డిజిటల్ గ్రంథాలయాల్లో 30800 పోస్టులు భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అవనిగడ్డలో శిక్షణ పొందుతున్న పలువురు నిరుద్యోగులు కార్యక్రమంలో పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు.

నేడు, రేపు ప్రతి ఇంటికీ పల్స్ పోలియో బృందం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గవర్నర్‌పేట, మార్చి 3 : పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదేళ్ల లోపు వయసు గల చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్న లక్ష్యంతో ఈనెల 4, 5 తేదీల్లో ప్రతి ఇంటినీ సందర్శించి ఏ కారణం చేతనైనా పోలియో చుక్కలు వేయించని చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని నిర్ణయించినట్టు కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం సివిల్ కోర్టు సమీపంలోని సీవీఆర్ స్కూల్‌లో కేంద్రంలో కలెక్టర్ ఢిల్లీరావు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 2.48లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ధారించడం జరిగిందన్నారు. 1008 కేంద్రాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్నామని తెలిపారు. బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో 35 కేంద్రాలతో పాటు 71 మొబైల్ వాహనాల ద్వారా పోలియో చుక్కలు వేసేందుకు 4244 మంది వ్యాక్సినేటర్స్‌ను నియమించడం జరిగిందన్నారు. 4, 5 తేదీల్లో ప్రతిఇంటికీ పల్స్ పోలియో బృందం సందర్శిస్తుందని, మిగిలిన పిల్లలకు చుక్కలు వేసేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత, టీబీ కంట్రోల్ అధికారిణి డాక్టర్ ఉషారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, సీఎంహెచ్‌వో డాక్టర్ రత్నావళి, డీపీఎంవో డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత జిల్లా లక్ష్యం

- కృష్ణాజిల్లా డీఎంహెచ్‌వో

మచిలీపట్నం టౌన్ : పోలియో రహిత జిల్లాగా రూపొందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. ఆదివారం ఉదయం మచిలీపట్నం భాస్కరపురం 12వ సచివాలయంలో చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసి ఆమె మాట్లాడారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడాన్ని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమంగా భావించాలన్నారు. 1453 కేంద్రాల్లో చుక్కలు వేసే కార్యక్రమం ప్రారంభించారన్నారు. జిల్లాలో లక్షా 45వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు లక్ష్యంగా పెట్టుకున్నామని, మొదటి రోజు 98 శాతం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్లు, కోనేరుసెంటర్ కూడలి ప్రాంతాల్లో పోలియోచుక్కలు వేయించామన్నారు. డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, బందెల థామస్ నోబుల్, డాక్టర్లు సుష్మ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభ విజయవంతం చేయండి

- కొనకళ్ల నారాయణ



మచిలీపట్నం టౌన్, మార్చి 3 : మంగళగిరి నియోజకవర్గం ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి ఎదురుగా ఈనెల 5న జరగనున్న జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం మచిలీపట్నంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల హక్కులను పరిరక్షించేది తెలుగుదేశం పార్టీ అన్నారు. ఎన్టీ రామారావు సీఎంగా ఉన్నప్పటి నుంచి రాష్ట్రంలో బీసీలందరూ టీడీపీ వెంటే ఉన్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీల రిజర్వేషన్లలో దారుణంగా కోత విధించారని, దాని వల్ల వారికి పదవులు లేకుండా పోయాయన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలందరూ తెలుగుదేశం, జనసేన కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదు

- కలిసి పనిచేస్తాం.. ఉమా, బొమ్మసాని



గొల్లపూడి : తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఏశక్తి ఆపలేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావులు అన్నారు. ఆదివారం గొల్లపూడిలో ఉమా, బొమ్మసాని కలిసి సంయుక్తంగా మాట్లాడుతూ, మైలవరంలో టీడీపీ గెలుపుకోసం, నారా లోకేశ్ శంఖారావం విజయవంతం చేసేందుకు కలిసి పనిచేస్తామన్నారు. సోమవారం జక్కంపూడి కాలనీలో జరగనున్న 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమాన్ని పార్టీశ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. మరో 50 రోజుల్లో టీడీపీ - జనసేన కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. గొల్లపూడి గ్రామ అధ్యక్షుడు నర్రా వాసు, రంగినేని నరేంద్రబాబు, గొరిజాల సాంబశివరావు (చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రజావ్యతిరేక పాలనతో విసిగిపోయి..

- టీడీపీలోకి భారీగా చేరికలు : బొండా ఉమా..





కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్/సత్యనారాయణపురం : సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రజలు వైసీపీ ప్రజా వ్యతిరేకపాలనతో విసిగిపోయి తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, దీంతో వైసీపీ నేతల్లో ఓటమి భయం పట్టుకుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 61వ డివిజన్‌కు చెందిన వైసీపీ మహిళలు వై.అరుణ, పి.మంగమ్మ, పి.కుమారి, భాగ్యరేఖ, దివ్య, పూజితలతో సహా మొత్తం 200 మంది మహిళలు తెలుగుదేశం పార్టీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ పార్టీ కార్యాలయంలో ఆదివారం బొండా ఉమా వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ వెలంపల్లి ఓటమి భయంతోనే తనపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. త్వరలో సెంట్రల్‌లో వైసీపీ ఖాళీ అవడం ఖాయమని, దమ్ముంటే వెలంపల్లి వలసలను ఆపుకోవాలన్నారు.

27వ డివిజన్ సాంబమూర్తి రోడ్డు బావాజీపేట డీమార్టు వద్ద ఆదివారం ఓర్సు మస్తాన్ ఆధ్వర్యంలో 200మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి బొండా ఉమా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో రాష్ట్రంలో సైకో పాలన పోయి రామరాజ్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో బొండా శ్రీను, బొండా సిద్ధార్థ, టీడీపీ రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు, కార్పొరేటర్ వీరమాచినేని లలిత, కె.రూప్‌కుమార్, డి.వెంకటరావు, కె.ధనశేఖర్, డి.జయరాజు, గోపి, బి.కొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

మచిలీపట్నం టౌన్ : టీడీపీ నాయకుల ఫొటోలను వైసీపీ నాయకులు కటౌట్లపై వేసుకోవడంపై జరిగిన ధర్నాతో ఆదివారం ఫ్లెక్సీలు, కటౌట్లను తొలగించారు. టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు ఇంటికి వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు వెళ్లి టీ తాగిన సమయంలో ఆ ఫొటోను కోనేరుసెంటర్ తదితర ప్రాంతాల్లో కటౌట్లపై వేశారు. దీంతో కోనేరుసెంటర్‌లో టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. తన అనుమతి లేకుండా ఫోటోలను నగరంలో కటౌట్లపై ఉంచారని పిప్పళ్ల సూర్యప్రకాశరావు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ నాయకులు నగరంలో పలుచోట్ల పిప్పళ్ల సూర్యప్రకాశరావు, పేర్ని కిట్టులతో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు.



చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడుతున్న ఎస్పీ అస్మి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన హెడ్‌కానిస్టేబుల్‌కు ఎస్పీ పరామర్శ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 3 : ప్రతి పోలీస్ సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా ఉంటానన్న కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తన విధేయతను చాటుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని శనివారం రాత్రి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. బంటుమిల్లి మండలం అత్తమూరుకు చెందిన మాకల నాగేంద్రప్రసాద్ వీరవల్లి స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం విధులకు ద్విచక్రవాహనంపై వస్తుండగా పెడన వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన నాగేంద్రప్రసాద్‌ను తొలుత బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. పోలీసు అధికారుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్పీ హుటాహుటిన విజయవాడకు వెళ్లి క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను సంప్రదించారు. నాగేంద్రప్రసాద్ ఆరోగ్యపరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారమివ్వాలని ఎస్పీ సూచించారు. నాగేంద్రప్రసాద్ కుటుంబసభ్యులను పరామర్శించి ఏ సహాయం కోసమైనా, తనకు తెలియజేయవచ్చని భరోసా ఇచ్చారు.



ఆత్కూరు పోలీసులు అరెస్ట్‌చేసిన బైక్‌ల దొంగలు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- మైనర్ సహా ఆరుగురి అరెస్టు
- ఐదు బైక్‌లు, సెల్‌ఫోన్లు, గంజాయి స్వాధీనం

ఉంగుటూరు, మార్చి 3 : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బైక్‌లు, సెల్‌ఫోన్లను దొంగిలిస్తూ, అప్పుడప్పుడు అక్రమంగా గంజాయిని తరలిస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్న ఐదుగురు యువకులు, ఒక మైనర్‌బాలుడిని ఆత్కూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, హనుమాన్ జంక్షన్ సీఐ ఎ.నవీన్ నరసింహమూర్తి ఆదేశాలమేరకు చెన్నై-కోల్‌కతా 16వ జాతీయ రహదారిపై పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద ఆత్కూరు ఎస్సై ఎ.పైడిబాబు సిబ్బందితో కలిసి శనివారం రాత్రి ఏలూరు నుంచి విజయవాడవైపు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో గంజాయి సేవించి అనుమానాస్పద స్థితిలో మూడు బైక్‌లపై వెళ్తున్న విజయవాడకు చెందిన మహమ్మద్ ఫిరోజ్ (23), ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ బషీద్(24), మహమ్మద్ ఇమ్రాన్(19), అబ్దుల్ హుస్సేన్ బాజీ(20), షేక్ అఫ్రీది(19), మైనర్ (18)లను ఆపి తనిఖీ చేయగా వారివద్ద 300గ్రా. గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లతోపాటు ఐదు బైక్‌లు పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఐదుగురిని అరెస్ట్‌చేసి వారిపై ఎన్డీపీఎస్ కేసు నమోదుచేశారు. కాగా మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ.3.5లక్షలు స్వాధీనం

పెనమలూరు, మార్చి3 : శ్రీకృష్ణ కాలనీలోని ఒక ఫ్లాట్‌లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకొని వారి నుంచి సుమారు రూ. 3.5లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్టు సీఐ టీవీవీ రామారావు పేర్కొన్నారు. పేకాట, గంజాయి లాంటి అసాంఘిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని సీఐ తెలిపారు. అలాగే పోరంకి ప్రభునగర్ కాలనీ సమీపంలోని పొలాల్లో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17,570 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఏప్రిల్ 18న లలితా సహస్రనామ మహా బృందగానం

విజయవాడ కల్చరల్, మార్చి 3: జయహో భారతీయం, దక్షిణాఫ్రికా-తెలంగాణ అసోసియేషన్ లింక్డ్ పీల్స్ సంస్థల ఆధ్వర్యంలో ఏప్రిల్ 18న 7500 మందితో లలితా సహస్రనామ మహా బృందగానం నిర్వహించనున్నట్లు ఐఆర్ఎస్ అధికారి వి.కోటేశ్వరమ్మ తెలిపారు. నగరంలోని జయహోభారతీయం సంస్థ కార్యాలయంలో ఆదివారం మహా బృందగానం విజయాన్ని కాంక్షిస్తూ మహాచండీహోమం, గణపతిహోమం, నవగ్రహ హోమాలను నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. భారతీయం సంస్థ లలితా పారాయణంతో పాటు ఏప్రిల్ 28న తెలుగురత్నాలు అవార్డులు ఇవ్వనుంది. నాట్యారామం పేరుతో వెయ్యిమంది కూచిపూడి నృత్యకళాకారులతో బృంద ప్రదర్శనలు చేయనున్నారు. సంస్థ గౌరవాధ్యక్షుడు మండవ శశిధర్‌చౌదరి, అధ్యక్షుడు వల్లేశ్వర్, గోళ్ల నారాయణరావు, వెన్నా వల్లభరావు, గుమ్మా సాంబశివరావు, సుదర్శన్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

జయహో బీసీ బహిరంగ సభను విజయవంతం చేద్దాం

గన్నవరం, మార్చి 3 : జయహో బీసీ బహిరంగ సభను విజయవంతం చేద్దామని గన్నవరం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ప్రకటనలో పేర్కొన్నారు. మంగళగిరిలో ఈ నెల 5న రాష్ట్ర స్థాయిలో జరగనున్న జయహో బీసీ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే బీసీల అభ్యున్నతి కోసం అమలు చేసే మ్యానిఫెస్టో అంశాలను, బీసీ డిక్లరేషన్‌ను అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటిస్తారని తెలిపారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బలహీన వర్గాల అభివృద్ధి, అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కృషి చేస్తుందని, పార్టీకి వెన్నుదన్నుగా నిలిచే బీసీలను వెన్నుతట్టి ప్రోత్సహించిందని, టీడీపీ అధికారమే లక్ష్యంగా పని చేయాలని కోరారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

జనసేన గన్నవరం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు



కానూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ మేనిఫెస్టోపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్, మార్చి 3 : వైసీపీ పాలనలో రాష్ట్ర అధోగతి పాలైందని రానున్న ఎన్నికల్లో టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి జన సైనికులు, వీర మహిళలు కృషి చేయాలని జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక హనుమాన్‌నగర్‌లో కమ్యూనిటీ హాలు వద్ద రమేష్‌బాబు టీడీపీ, జనసేన కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడుతూ, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విజన్ ఉన్న చంద్రబాబు నాయుడు, సామాజిక స్పృహ కలిగిన పవన్ కల్యాణ్ నాయకత్వాలను బలపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అరాచకపాలన సాగిస్తున్న వైసీపీని ఓడించి టీడీపీ, జనసేన కూటమిని బలపర్చాలని కోరారు. జనసేన, టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరమహిళ శిరీష, జనసేన మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, వార్డు సభ్యుడు తాడి శెట్టి శ్రీనివాసరావు, నాగులు, సతీష్, సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలను అధికారంలోకి తీసుకు రావాలని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బాపులపాడు పట్టణ టీడీపీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని గ్రామంలోని రైల్వేస్టేషన్ ఏరియాల్లో నిర్వహించారు. ఇంటింటా సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తూ గన్నవరం టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను రాజేశ్వరరావు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వడ్డిల్లి లక్ష్మి, గార్లపాటి రాజేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వర రావు, నాయకులు వీరమాచనేని బుజ్జి, కాకుల శ్రీను, గొట్టాపు వాసు,బోయపాటి ప్రసాద్, సంగ్రామ్, కడవకొల్లు రాజేష్, సత్తార్, కోమర్తిసాయి,కర్రా ప్రసాద్ పౌల్ పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోపై విస్తృతంగా ప్రచారం చేయాలి

పెనమలూరు : చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలోని ఆరు అంశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని టీడీపీ నేతలు వెలగపూడి శంకరబాబు, గొట్టిపాటి వెంకట శివరామకృష్ణప్రసాద్, షేక బుజ్జి పిలుపునిచ్చారు. ఆదివారం కానూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలోవారు పాల్గొని మాట్లాడారు. యూనిట్ ఇన్‌చార్జిలకు, బూత్ కన్వీనర్లకు బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ఆరు పథకా గురించి అవగాహన కల్పించారు. పార్టీ కార్యాలయం నుంచి పంపిన ఆరు గ్యారెంటీల టేబుల్ క్యాలెండరును ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. వేగే పూర్ణయ్య, కోసూరి రమేష్, రఫీ, రెహమాన్, ఇనయతుల్లా, సుంకరసాయి, ఇక్బాల్, నల్లూరి శేఖర్, బాషా, కరీం, సమీర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లస్టర్, బూత్ కన్వీనర్లు అప్రమత్తతతో ఉండాలి

ఉయ్యూరు : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ యూనిట్, బూత్ కన్వీనర్లు అప్రమ త్తతతో ఉండాలని పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ అన్నారు. ఉయ్యూరు నగర పంచాయతీ పరిధి 9వ క్లస్టర్‌లో యూ నిట్, బూత్ కన్వీనర్లతో భవిష్యత్ కార్యాచరణ, ఓటర్ల జాబితాపై చర్చించి పలు అంశాలు చర్చించారు. క్లస్టర్ ఇన్‌చార్జి కూనపరెడ్డి శ్రీనివాస్, మాజీ చైర్మన్ ఖుద్దూస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుర్నాధరావు, కౌన్సిలర్ పలియాల శ్రీనివాసరావు, చిరంజీవి, జయదేవ్, భాస్కర్, చక్కా సుబ్బారావు, చిరంజీవి, బూరెల నరేశ్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు



బాపులపాడులో కరపత్రాలు పంపిణీ



బూత్ కన్వీనర్లతో బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్

భక్తిభావనతో శివరాత్రి జరుపుకోవాలి

సీఐ రామారావు



శివరాత్రి ఏర్పాట్ల సమీక్షలో మాట్లాడుతున్న సీఐ

పెనమలూరు, మార్చి 3 : వచ్చే ఎనిమిదిన యనమలకుదురులో జరిగే శివరాత్రి వేడుకలను భక్తులు భక్తిభావనలతో జరుపుకోవాలని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు పేర్కొన్నారు. ఆదివారం యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శాంతి భద్రతల సమీక్షపై జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరయ్యే శివరాత్రి ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎస్ఐలు యేసోబు, శేషకుమార్, ఈఓ గంగాధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: తుమ్మల



అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న తుమ్మల చంద్రశేఖర్

నెప్పల్లి (కంకిపాడు), మార్చి 3 : అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు తుమ్మల చంద్రశేఖర్ అన్నారు. నెప్పల్లిలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా తుమ్మల చంద్రశేఖర్ మాట్లాడుతూ, అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో రానున్నది తెలుగుదేశం పార్టీయే అన్నారు. బాధిత కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించే విధంగా చర్యలు చేపడతామన్నారు. అదే విధంగా అనారోగ్యంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన చలసాని బోసను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కొణతం గిరిధర్, కొప్పరాజు సురేష్, బత్తుల కామేశ్వరరావు, కొలుసు గోవిందు, విజయ్, రామ్ లక్ష్మణ్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ముప్పా రాజా, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభలతో వీరమ్మ తిరునాళ్లకు



ప్రభబండితో తరలివస్తున్న భక్తులు

ఉయ్యూరు, మార్చి 3 : వీరమ్మ తిరునాళ్లకు ఉయ్యూరు పరిసర గ్రామాలనుంచి ప్రభలతో భక్తులు తరలివచ్చారు. తిరునాళ్లలో ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలిరాగా పరిసర గ్రామల భక్తులు ఎడ్ల బండ్లపై పెద్ద ప్రభలు కట్టి డప్పువా యిద్యాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కు తీర్చుకున్నారు. ఎండ్లబండ్లు, ట్రాక్టర్లు, ఆటోల్లో వచ్చిన భక్తులకు వాటిని నిలిపేందుకు పార్కింగ్ సౌకర్యం లేక ఇబ్బంది పడ్డారు. ప్రధాన సెంటర్ రింగు వద్ద, కాటూరు రోడ్డులో ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు నిలపడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. పోలీసులు ఉన్నప్పటికి పట్టించుకోపోవడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు.

భక్తులకు ప్రసాదం పంపిణీ

వీరమ్మ తిరునాళ్లలో భక్తులకు ఆదివారం వివిధ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ప్రసాదం పంపిణీ చేశారు. తిరునాళ్లకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా వారికి ప్రసాదం, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు గుండా తులసీరామ్ కుటుంబ సభ్యులతో కలసి ప్రసాదం పంపిణీ చేశారు. తిరునాళ్లలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేసి సేవలందించడం మహాభాగ్యం భావిస్తున్నట్టు పేర్కొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం

ఉయ్యూరు, మార్చి 3 : ఉయ్యూరులో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజ యవంతంగా నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద కమిషనర్ వెంకటేశ్వరరావు పిల్లలకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో ప్రారంభించారు **కంకిపాడు :** పోలియో రహిత సమాజం కోసం పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించుకోవాలని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. ఈడుపుగల్లులో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామస్థులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. **విజయవాడ రూరల్ :** పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు సుబ్రహ్మణ్యంరాజు అన్నారు. విజయవాడ రూరల్ మండలంనున్న గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. **హనుమాన్‌జంక్షన్ :** పల్స్‌పోలియో కార్యక్ర మంలో భాగంగా ఆదివారం బాపులపాడు పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో 95శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి మంజూషా తెలిపారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** పోలియో రహిత రాష్ట్రంగా అవతరించేందుకు ప్రజల సహకారం అవసరమని ఎంపీపీ నగేష్, జెడ్పీటీసీ గంగాభవాని, వైస్ ఎంపీపీ చందు రమాదేవి తదితరులు వేర్వేరు కార్యక్రమాల్లో సూచించారు. వీరవల్లి పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ కిరణ్మయి పర్యవేక్షణలో వివిధ గ్రామాల్లో 25 బూత్‌ల ద్వారా, బాపులపాడు పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ మంజూష పర్యవేక్షణలో వివిధ గ్రామాల్లో 35 బూత్‌లను ఏర్పాటు చేసి ఆదివారం పోలియో చుక్కల మందును పంపిణీ చేశారు. **ఉంగుటూరు :** ఐదేళ్లలోపు చిన్నారులు అంగవైకల్యం బారి నపడకుండా రక్షించడానికి తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు రెండు పోలి యోచుక్కలు వేయించాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండల పరిధి లోని ఆత్కూరు, పెదఅవుటపల్లి, ఉంగుటూరు, ఇందుపల్లి పీహెచ్‌సీల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. 97శాతం చిన్నారులకు పోలియోచుక్కలు వేసినట్లు నాలుగు పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు. సర్పంచ్ కత్తుల జ్యోతి, వైద్యాధికారులు డాక్టర్ సుజిత, డాక్టర్ కరీముల్లా మొహినుద్దీన్, డాక్టర్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. **గన్నవరం :** అంగవైకల్యాన్ని శాశ్వతంగా పారద్రోలేందుకు చిన్నారులకు పోలియో చుక్కలు దోహదపడతాయని రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ్‌కుమార్ అన్నారు. స్థానిక రోటరీ క్లబ్‌లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్ర మాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యదర్శి నర్రా సీతారా మారావు తదితరులు పాల్గొన్నారు. ముస్తాబాద పీహెచ్‌సీ పరిధిలో 29 సెంటర్లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ పర్వతనేని శ్రీహర్ష తెలిపారు.



ఉయ్యూరులో పల్స్ పోలియో ప్రారంభిస్తున్న కమిషనర్



నూజివీడు రోడ్డులోని గుడిసెల్లో పిల్లలకు చుక్కలు మందు వేస్తున్న వైద్యసిబ్బంది

రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించాలి



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకటేశ్వరరావు

గన్నవరం, మార్చి 3 : రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్‌లో రానున్న ఎన్ని కల్లో గన్నవరం నుంచి సీపీఎం పోటీ చేయడానికి అవసరమైన ప్రణాళిక రూపొందిం చుకోవడానికి డివిజన్ స్థాయి సమావేశం ఆదివారం కళ్లం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో సీపీఎం పోటీ చేసే స్థానాల్లో గన్నవరం కూడా ఒకటన్నారు. నాలుగు మండలాల్లో ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసి సీపీఎం విజయం సాధించిందని ఇందుకు అంగన్వాడీ, ఆశా వర్కర్‌లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల పోరాటాలే నిదర్శనమన్నారు. నాయకులు ఆర్.రఘు, ఎం.హరి బాబు, టీవీ లక్ష్మణస్వామి, జ్యోతి, బేతా శ్రీని వాసరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అజ్మీర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమాజ సేవకు ప్రతి ఒక్కరూ పాటు పడాలి



శాంతి రథాన్ని ప్రారంభిస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులు

గన్నవరం, మార్చి 3 : మానవతా సేవా సంస్థ గన్నవరం శాఖ ఆదివారం శాంతి రథం (మహా ప్రస్థానం) రెండు ఫ్రీజర్ బాక్స్‌లను ప్రారంభించారు. శాంతి రథాన్ని పుణ్యాచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్, మదుపల్లి విజయ్‌కుమార్ (వీనస్ స్నాక్స్), మదుపల్లి బాలకృష్ణ సోదరులు సంయుక్తంగా ఏర్పాటు చేయగా ఫ్రీజర్ బాక్సులను మానవతా సంస్థ ఇచ్చింది. అనంతరం మాన వతా సేవా సంస్థ గన్నవరం శాఖ కార్యవర్గ ప్రమాణాస్వీకారం జరిగింది. అధ్యక్షులుగా మదుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యదర్శిగా కర్ర వరప్రసాద్, కోశా ధికారిగా పొట్లూరి రామకృష్ణతో సహా ఏడుగురితో కార్యవర్గం, 15 మంది సలహా దారులతో కొత్త శాఖ ఏర్పాటైంది. ఈ సందర్భంగా జాస్తి విజయభూషణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సమాజ సేవకు పాటు పడాలని పిలుపునిచ్చారు. మానవతా సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు మారుబోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు

పెనమలూరు, మార్చి 3: పోరంకి టీడీపీ కార్యాలయ ఆవరణలో ఆదివారం అనుమోలు ఆదరణ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. క్యాపిటల్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ ఉచిత వైద్యశిబిరంలో 200 మందికి షుగరు, బీపీ తదితర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ అనుమోలు ప్రభాకరరావు, బొంగరాల అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న కరపత్రం



విజయవాడ రూరల్, మార్చి 3 : నున్నలో మరోసారి కరపత్రం కలకలం రేపింది. ఐదేళ్లపాటు న్యాయస్థానంలో ఓ రోడ్డు దురాక్ర మణ కేసులో నున్న గ్రామ పంచాయతీ కేసు గెలిచినప్పటికీ అక్రమ నిర్మాణాలను తొలగించడంలో తత్సారం చేయడంపై స్థానికంగా ఆది వారం ఓ కరపత్రం విడుదలైంది. న్యాయస్థానం తీర్పు వెలువరించినా... అధికారులు స్పందించరే... అనే పేరుతో కరపత్రం గ్రామంలోని పలు కూడళ్లల్లో చక్కెర్లు కొడుతోంది. ప్రధాన కూడళ్లల్లో కరపత్రాలు కట్టలు కట్టలు ఉండటంతో గ్రామంలో చర్చనీయాంశమైంది. కరపత్రంలోని సారాశం ప్రకారం ఐదేళ్ల క్రితం అప్పటి వైసీపీ నేత ఓ న్యాయవాది గ్రామంలో ఓ రోడ్డు తనదేనంటూ ఆక్రమించుకున్నాడు. ఆ రోడ్డు స్థానికంగా ఉన్న రెండు దళిత కాలనీలను అనుసం ధానం చేస్తుంది. అంతటితో ఆగని న్యాయవాది రోడ్డుకు ఇరువైపులా గోడ నిర్మాణం కూడా చేపట్టాడు. ఈ వ్యవహారంపై అప్పటి గ్రామ పంచాయితీ కార్యదర్శి హైకోర్టును ఆశ్రయించారు. ఐదేళ్ల పాటు న్యాయస్థానంలో నలిగిన ఈ కేసు విషయమై ఫిబ్రవరి 19వ తేదీన న్యాయస్థానం తుది తీర్పును వెలువరించింది. ఆక్రమిత రోడ్డు పంచాయితీకి చెందిదని తీర్పు వెల్లడించడంది. అయితే ఇటీవల న్యాయవాది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. రోడ్డు పంచాయతీ స్వాధీనంపై సందిగ్ధత నెలకొంది.

ఉషారామాకు అరుదైన అవకాశం

ఉంగుటూరు, మార్చి 3 : తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ (అటానమస్) కళాశాలకు జేఎన్‌టీయూ కాకినాడ నుంచి అరుదైన అవకాశం లభించిందని, కళాశాలలో రెండు ఇంజనీ రింగ్ బ్రాంచ్‌లలో పరిశోధనా కేంద్రాలను మంజూరు చేస్తూ అనుమతి పత్రాలు జారీ చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌పీ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాద రాజు నుంచి అందుకున్న అనుమతి పత్రాలను ఆదివారం కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మంకు ప్రిన్సిపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కుర్రా రాజశేఖరరావు, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం



మచిలీపట్నం టౌన్, మార్చి 3 : ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం కార్యాలయంలో జరిగింది. అధ్యక్షుడిగా అంబటిపూడి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా వి.సాంబశివ రావు, కార్యదర్శిగా నూకల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఏపీటీఎఫ్ నేత వి.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రామారావు ఈ ఎన్నిక నిర్వహించారు. స్పాట్ వాల్యుయేషన్ బకాయిలు చెల్లించాలని నూతన అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు.



చుక్కల మందు వేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ



కూచిపూడిలో...



ఘంటసాలలో..

పోలియో మహమ్మారిని తరిమికొడదాం

మచిలీపట్నం టౌన్, మార్చి 3 : పోలియో మహమ్మారిని తరిమేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేయర్ వెంకటేశ్వరమ్మ పిలుపునిచ్చారు. నగరంలోని 43వ డివిజన్‌లో పోలియో చుక్కలు వేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. 27వ డివిజన్ సచివాలయంలో టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము పోలియో చుక్కలు వేశారు. ఆంధ్రజాతీయ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పోలియో కేంద్రం వద్ద జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు పోలియో చుక్కలు వేశారు. **పెడన** : ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని చైర్‌పర్సన్ కటకం నాగకుమారి సూచించారు. బ్రహ్మపురం పాఠశాలలో ఆదివారం ఆమె పల్స్‌పోలియో కార్యక్రమం ప్రారంభించారు. కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్‌బాబు, ఉమ్మిటి తనూజ తదితరులు పాల్గొన్నారు. **పెడన రూరల్** : చేవేంద్రపాలెం పీహెచ్‌సీ పరిధిలో 98 శాతం పల్స్‌పోలియో చుక్కలమందు వేసినట్లు వైద్యాధికారి ప్రదీప్ కుమార్ తెలిపారు. డాక్టర్ రమ్య, లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు. **మోపిదేవి** : మోపిదేవి సచివాలయంలో ఎంపీపీ రావి దుర్గా వాణి, సర్పంచ్ నందిగం మేరీ రాణి చిన్నారులకు చుక్కల మందు వేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెదకళ్లేపల్లి, పెదప్రోలు, మోపిదేవి లంక గ్రామాల్లో గ్రామసర్పంచ్‌లు అరజా సంధ్యారాణి, పొలిమేట్ల ఏసుబాబు, మోర్ల జ్యోత్స్న, ఎంపీటీసీ సభ్యులు కొమ్ము పవన్ కుమార్, దిడ్ల రాణిలు చిన్నారులకు చుక్కల మందు వేశారు. పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 984 మంది చిన్నారులకు గానూ 949 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ శ్రీరాం సాయి తెలిపారు. **అవనిగడ్డ** : అవనిగడ్డ టీడీపీ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. టీడీపీ నాయకులు బండే రాఘవ, రావి రత్నగిరి, తదితరులు పాల్గొన్నారు. **కోడూరు** : ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డలో సర్పంచ్ దాసరి విజయ కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఏఎన్ఎం భ్రమరాంబ పాల్గొన్నారు. **నాగాయలంక** : నాగాయలంకలో సర్పంచ్ కైతేపల్లి అంకాలు, సభ్యులు చిట్టా వీర అన్నపూర్ణయ్య పిల్లలకు చుక్కల మందు వేశారు. వైద్యాధికారులు ఎం.ఇంద్ర కుమార్ రెడ్డి, వి.శివ రామకృష్ణ పాల్గొన్నారు. పిహెచ్ సిలో పలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు వేయగా, వైద్యాధికారులు పర్యవేక్షించారు. **ఘంటసాల** : ఘంటసాలలో ఎంపీపీ వేమూరి రజని కుమారి, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, వేమూరి ప్రవీణ్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్యాధికారులు వేమూరి ప్రవీణ్, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పెద్దగూడెంలో ఎంపీటీసీ సభ్యురాలు దిరిశం వెంకట లక్ష్మి, మల్లాయిచిట్టూరులో సర్పంచ్ ఆవుల రేవతి, శ్రీకాకుళంలో ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), చిట్టూర్పులో సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, అచ్చెంపాలెంలో సర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు, కొడాలిలో వైద్యురాలు అనిత, తెలుగురావుపాలెంలో సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, పాపవినాశనంలో సర్పంచ్ కుంపటి అనిత, ఘంటసాలపాలెంలో సర్పంచ్ దోనె రజని తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **కూచిపూడి** : కూచిపూడి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ పాల్గొని పోలియో చుక్కలు ప్రారంభించారు. సాయి ఆరోగ్య హాస్పటల్ డైరెక్టర్ సూర్యప్రభ, పిడియాట్రిక్ డాక్టర్ పరశురాం, మొవ్వ వైద్యాధికారి ఎం.వేదరాజ్, సిహెచ్.రాజేశ్వరి పాల్గొన్నారు. కూచిపూడి రోటరీక్లబ్ అధ్యక్షులు కత్తిక రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగింది. రోటరీక్లబ్ కార్యదర్శి రవిబాబు, కోనేరు మంజునాథ్, పిన్నమనేని గోపాలకృష్ణ, దండమూడి వంశీకృష్ణ, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, కూచిపూడి గ్రామ పెద్ద కొండవీటి అమర బాలేశ్వరరావు, సంజీవని ఆసుపత్రి ఈవో హనుమ కుమార్, సిహెచ్‌ఓ శంకర్ రావు, అన్నామణి, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ రూరల్** : మండలంలో పోలియో చుక్కల మందు కార్యక్రమం ఆదివారం జరిగింది. మోటూరు, చౌటపల్లి తదితర గ్రామాల్లో పోలియో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో చిన్నారులకు చుక్కల మందు వేశారు. **చల్లపల్లి** : పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. పురిటిగడ్డ పీహెచ్‌సీ పరిధిలో, మండలంలోని ఆయా గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చల్లపల్లిలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.



సై క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న వెనిగండ్ల రాము, రావి



వర్ల కుమార్ రాజా పల్లెబాట కార్యక్రమంలో పూలవర్షం కురిపిస్తున్న కార్యకర్తలు

శివారు కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యం

● బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము

గుడివాడ, మార్చి 3 : టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో తొలి దశలో శివారు ప్రాంతాల్లోని కాలనీల అభివృద్ధి చేపడతామని గుడివాడ నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. ధనియలపేటలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలిసి వెనిగండ్ల ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ ధనియాలపేట కాలనీలో ప్రజల కనీస అవసరాలను తీర్చలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ హయాంలో ఎక్కడా తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గాన్ని ఇటువంటి దుర్భర పరిస్థితుల్లో వదిలేసి ఎమ్మెల్యే నాని రాష్ట్ర, జాతీయ సమస్యలపై మాట్లడుతుంటే విచిత్రంగా ఉందన్నారు. రోజూ గొంతు చించుకుంటూ ఏది పడితే అది వాగే నానికి ప్రజాసమస్యలపై సమాధానం చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాస్, వసంతవాడ దుర్గారావు, శొంఠి రామకృష్ణ, రామధేను వేణుబాబు, మజ్జాడ నాగరాజు, దేవాది నాగేశ్వరరావు, వంగపండు ఆదినారాయణ, పమిడి సుబ్రహ్మణ్యం, తమ్మినేని చంద్రశేఖర్, హనుమంతు జనార్ధన్, టెక్కలి నాగరాజు, లింగంశెట్టి లక్ష్మీ, పోలవరపు శ్రీనివాసరావు, దత్తి రామారావు, బంగారు నాయుడు, ప్రసాదు, వెంకటేశ్వరరావు, శివ, ఐటీడీపీ కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు. సై క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు.

మీ బిడ్డగా ఆదరించండి : పల్లెబాటలో కుమార్ రాజా

తోట్లవల్లూరు, మార్చి 3 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా జనసేన పార్టీ మద్దతుతో పోటీచేస్తున్న తనను మీ బిడ్డగా ఆదరించి గెలిపించాలని, తానేంటో అభివృద్ధితో నిరూపించుకుంటానని వర్ల కుమార్ రాజా అన్నారు. తోట్లవల్లూరులో ఆదివారం సాయంత్రం 28వ రోజు పల్లెబాట నిర్వహించారు. కార్యకర్తలు, యువత, గురుమూర్తి యువసేన, జనజేన కార్యకర్తలు భారీగా తరలి వచ్చి పూలవర్షం కురిపిస్తూ, టపాసుల మోతతో హోరెత్తించారు. పాలభిషేకం చేసి ఆశీర్వదించారు. దళితవాడ సెంటర్లో కుమార్ రాజా మాట్లాడుతూ ఈ అభిమానం చూస్తుంటే జన్మధన్యమయినట్టుందన్నారు. వైసీపీ రాక్షస పాలనను అంతమొందించేందుకు రానున్న ఎన్నికల్లో టీడీపీకి భారీ విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. జగన్ పంచాయతీ నిధులను దొంగిలిస్తే, స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మట్టి, ఇసుకను దోచుకుతింటున్నాడని ఆరోపించారు. చంద్రబాబును సీఎం చేయటమే అందరి కర్తవ్యం కావాలని పిలుపు నిచ్చారు. వీరంకి వెంకట గురుమూర్తి, వీరపనేని శివరామ్‌ప్రసాద్, నెక్కలపూడి మురళీ, గొరిపర్తి గోపయ్య, వల్లూరు రాంబాబు, తటుకూరి రమణ, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, గంగిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులు తాకట్టు పెడతారు జాగ్రత్త : గోపీచంద్

మచిలీపట్నం టౌన్, మార్చి 3 : సచివాలయాన్ని తాకట్టు పెట్టిన సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజల ఆస్తులు తాకట్టు పెడతారని సీనియర్ టీడీపీ తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మచిలీపట్నం టీడీపీ అసెంబ్లీ నియోజక వర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రీసర్వే పేరుతో స్థలాలను వెతికి తనఖా పెట్టేందుకు వైసీపీ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. దేవాలయాల ఆస్తులు తాకట్టుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సామాన్య , మధ్య తరగతి ప్రజలపై మోయలేనన్ని పన్నుల భారం వేసి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలు, యువతీ యువకులకు ఆశించిన విధంగా అభివృద్ధిని సాధించగలుగుతారన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, నాయకులు పి.వి. ఫణికుమార్, చిన్నం శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుల్లపాడులో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పెడన రూరల్ : పుల్లపాడులో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గణపతి, విశ్వేశ్వరస్వామి, అమ్మవారి విగ్రహాలతో పాటు కాలభైరవుడు, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హా రిక, పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర టీడీపీ ఆపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము., మాజీ సర్పంచ్ జోగి సుబ్రహ్మణ్యం గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.



ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న కాగిత కృష్ణప్రసాద్

వైభవంగా పామర్రు గంగానమ్మ జాతర

పామర్రు : పామర్రు గ్రామ దేవత గంగానమ్మ జాతర మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. గ్రామ సంచారం అనంతరం అమ్మవారు మధ్యాహ్నం 3గంటలకు ఆలయానికి చేరుకున్నారు. గ్రామ ప్రజలు నైవేద్యాలు సమర్పించారు. పిల్లలు, పెద్దలు తలపై గండదీపాలు పెట్టుకుని, గారెల దండలు ధరించి చలువ వస్త్రాలపై వచ్చి అమ్మ వారికి సమర్పించారు. అమ్మవారికి మహానైవేద్యం సమర్పించారు. తొలి నైవేద్యం గ్రామ తొలి మునసబు ఇంటి నుంచి రాగా అనంతరం భక్తుల నైవేద్యాలను స్వీకరించారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, జనసేన, టీడీపీ ఇన్‌చార్జిలు వర్ల కుమార్‌రాజా, తాడిశెట్టి నరేష్ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు భారీవిరాళాలందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసింది. సీఐ శుభాకర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో పామర్రు, పెదపారుపూడి, కూచిపూడి పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. దాతలు పులిహోర, లడ్డూ ప్రసాదం, మజ్జిగా ప్యాకెట్లను పంపిణీ చేశారు.



పామర్రు గంగానమ్మ జాతరలో భక్తజనసందోహం



ఏఎఎన్ఎం వార్షికోత్సవం

గుడ్లవల్లేరు : ఏ.ఏ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 36వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ ఎం. ప్రభాకర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. గత ఏడాది టెన్త్‌లో ప్రతిభ చూపిన ఉమేష్ చంద్ర, ఉషాప్రియలకు ఆంధ్రా బ్లడ్ బ్యాంక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కామినేని అచ్యుతబాబు రూ.5000 చొప్పున, పూర్వ విద్యార్థి అమలేశ్వరరావు (యుఎస్ఏ) రూ.30 వేలు విద్యార్థులకు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ కొడాలి వెంకట కృష్ణారావు, డైరెక్టర్ నారాయణం శ్రీనివాస మూర్తి, లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు మురళీ కృష్ణ చంద్రం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ప్రిన్సిపాల్ ఎడ్విన్

నూరు శాతం ఫలితాలు సాధించాలి

అవనిగడ్డ రూరల్ : నూరుశాతం ఫలితాల సాధన లక్ష్యంగా పని చేయాలని పులిగడ్డ గురుకుల విద్యాలయం మాజీ ప్రిన్సిపాల్ కె.ఎడ్విన్ అన్నారు. పులిగడ్డ గురుకుల విద్యాలయం వార్షికోత్సవ సభలో ఎడ్విన్ ఆధ్వర్యంలో పాఠశాల రిటైర్డ్ ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యంను సన్మానించారు. ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతిదేవి, సర్పంచ్ దాసరి విజయ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులిగడ్డ పిచ్చేశ్వర రావు, విశ్రాంతం ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. వీరకుమార్ ఆధ్వర్యంలో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు : డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు జన్మభూమి మెడికల్ సెంటర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకట్రావు, డాక్టర్ కె.శ్రావణ్ కుమార్, డాక్టర్ ఎ.దుర్గా భవాని, డాక్టర్ వెంకట రమణ 150 మందికి పరీక్షలు నిర్వహించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

చల్లపల్లి : రాబోయే సాధారణ ఎన్నికల నేపథ్యంలో చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు ఎస్సై సిహెచ్.చిన్నబాబు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై ఎలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొన్నా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనాలకు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

కోడూరు : వాహనాలకు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని కోడూరు ఎస్సై పి.శిరీష అన్నారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాల పత్రాలు పరిశీలించారు. పెండింగ్ చలానాలను మీ సేవ కేంద్రం ద్వారా వెంటనే కట్టించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


బాలయోగికి టీడీపీ నేతల నివాళి

అవనిగడ్డ : లోక్‌సభ మాజీ స్పీకర్ జి.ఎం.సి బాలయోగి 22వ వర్ధంతిని అవనిగడ్డ టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. టీడీపీ నాయకులు బాలయోగి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు యాసం చిట్టిబాబు, మాచవరపు ఆదినారాయణ, బండే రాఘవ, బచ్చు రఘునాథ్, మేడికొండ విజయ్, లుక్కా వెంకట పిచ్చియ్య, ఘంటసాల రాజమోహనరావు, మండలి రామ్మోహనరావు, మెగావత్తు గోపి, ఎలవర్తి చిన్నా, బడే సుబ్బారావు, షేక్ ఖలీల్, తండు గంగాధర్, భోగిరెడ్డి బుజ్జి, గరికపాటి హరి, కొండవీటి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆర్థిక సాయం

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం ఆదివెలమ సంఘం ఐదుగురు విద్యార్థులకు రూ. 60 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, పిళ్లారిశెట్టి సత్యనారాయణ, పిళ్లారిశెట్టి శ్రీనివాస్, కుసుమ హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



దొంతులమ్మ లడ్డూ రూ.లక్ష

మచిలీపట్నం టౌన్ : ఉల్లింగిపాలెంలో వేంచేసియున్న దొంతులమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ప్రసాదం లడ్డూ వేలం వేయగా, సైకం శేఖర్ రూ.లక్షకు పాడుకున్నారు. లడ్డూను మేళతాళాలతో ఊరేగింపుగా ఇంటికి తీసుకువెళ్లారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కర్, కొల్లు రంగనాయకులు, బొమ్మిడి రామయ్య, అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యకు ప్రోత్సాహం

మచిలీపట్నం టౌన్ : బాలికలు విద్యావంతులైతే సమాజం విద్యావంతమవుతుందని జాతీయ మానవ హక్కుల సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె. విజయలక్ష్మి అన్నారు. పరాసుపేటలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బాలికల హాస్టల్‌ను ఆదివారం సందర్శించారు. బాలికల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాయం చేస్తామన్నారు. విజయలక్ష్మి, కాపవరపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరస్వామికి 101 కొబ్బరికాయలు కొట్టిన ఎమ్మెల్యే కైలే

తోట్లవల్లూరు : ఐలూరు శ్రీరామేశ్వరస్వామికి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైసీపీ నాయకులు ఆదివారం 101 కొబ్బరికాయలు కొట్టారు. 2019లో గెలిపించినట్టుగానే 2024 ఎన్నికల్లో కూడా గెలిపించాలని వేడుకున్నట్లు వైసీపీ నాయకులు తెలిపారు. తహసీల్దార్ కుసుమకుమారి అధ్యక్షతన రామేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ మహా శివరాత్రికి విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాలకు తాను వ్యక్తిగతంగా రూ.లక్ష ఇస్తున్నట్టు ప్రకటించారు.

438 మంది రైతులకు రూ.19.51 లక్షల డివిడెండ్ల పంపిణీ

తోట్లవల్లూరు : భద్రిరాజుపాలెం పీఏసీఎస్‌లో ఎమ్మెల్యే అనిల్‌కుమార్, కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి రైతులకు రూ.19,51,238 డివిడెండ్ పంపిణీ చేశారు. ఎంపీపీ రాజామణి, జడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ హేమలత, ఉపసర్పంచ్ తిరుమలరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు చంద్రిక పాల్గొన్నారు. నార్త్వవల్లూరు పీఏసీఎస్ గోడౌన్, కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు పడమట హరిబాబు, సర్పంచ్ పెనుముత్స రాధిక తదితరులు పాల్గొన్నారు.